04112024-DIS-18_Layout 1 11/4/2024 3:50 AM Page 1



# కటింగ్ లేకుండా వడ్లు కొంటాం

- పెద్దపల్లి ఎమ్మెల్యే సీహెచ్ విజయరమణారావు
- పలు గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



సుల్తానాబాద్: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్/సుల్తానాబాద్ రూరల్, నవంబర్ 3: ఎలాంటి కటింగ్ లేకుండా రైతుల నుంచి వడ్లు కొనుగోలు చేసి.. మద్దతు ధర కల్పిస్తామని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని సుగ్లాంపల్లి, కందునూరిపల్లిలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. సెంటర్ల భాధ్యులు రైతులకు ఇబ్బందుల్లేకుండా చూసుకోవాలన్నారు. అలాగే టీయూఎఫ్ఐడీసీ నుంచి రూ.20లక్షలతో సుగ్లాంపల్లిలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఇక్కడ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, ఏఎంసీ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు, వైస్ చైర్మన్ గణేశ్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, నేతలు సాయిరి మహేందర్, వేగోళం అబ్బయ్యగౌడ్, ముస్త్యాల రవీందర్, సంతోష్‌రావు, శేఖర్ ఉన్నారు.

కాల్వశ్రీరాంపూర్, నవంబర్ 3: వెన్నంపల్లి, జాఫర్‌ఖాన్‌పేట, ఇద్లాపూర్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే విజయరమణారావు ప్రారంభించారు. ఇక్కడ పీఏసీఎస్ చైర్మన్ గజవెల్లి పురుషోత్తం, వైస్ చైర్మన్ తిరుపతి, మాజీ ఎంపీపీ గోపగాని సారయ్యగౌడ్, సీఈవో విజేందర్, ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ రాజమల్లు, డైరెక్టర్లు, ఏపీఎం కనుకయ్య, మండల శాఖ అధ్యక్షుడు గాజనవేన సదయ్య పాల్గొన్నారు.

ఎలిగేడు, నవంబర్ 3: నర్సాపూర్, నారాయణపల్లి, ర్యాకల్‌దేవ్‌పల్లి , రాములపల్లిలో కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే విజయరమణారావు ప్రారంభించారు. రైతులు పండించిన సన్నవడ్లకు ఈ సీజన్ నుంచే రూ.500 బోనస్ ఇస్తామన్నారు. ఇక్కడ సింగిల్ విండో చైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి, సీఈవో విక్రమ్, పార్టీ మండలాధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు సంతోష్‌రావు, వెంకటేశ్వర్‌రావు, సత్యనారాయణ, పర్శరాములుగౌడ్, గోపు వెంకట్‌రెడ్డి, కునమల పీటర్, కొడూరి రమేశ్, సతీశ్, పొట్యాల రమేశ్, సీతారాంరెడ్డి, తదితరులు ఉన్నారు.

## సమగ్ర కుటుంబ సర్వే ఇండ్ల పరిశీలన పూర్తి

కమాన్‌పూర్, నవంబర్ 3: సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా ఆదివారంతో ఎన్యుమరేటర్ల ఇండ్ల గుర్తింపు ప్రక్రియ ముగిసింది. మండలంలో 78మంది ఎన్యుమరేటర్లు 8మంది పరిశీలకుల పరిశీలనలో ఈ ప్రక్రియ పూర్తి చేశారు. ప్రతి గ్రామంలో ఇండ్ల గుర్తింపు సేకరణలో భా గంగా ఇంటింటికి స్టిక్కర్లు అంటించారు. ఈనెల 6 నుంచి కుటుంబ సర్వేకు వచ్చే సిబ్బందికి ప్రజలు పూర్తి ఆధారాలతో వివరాల నమోదుకు సహకరించాలని ఎంపీడీవో లలిత, తహసీల్దార్ వాసంతి, ఎంపీ వో భాస్కర్ కోరారు.

## యువకుడి మృతి

ముత్తారం, నవంబర్ 3: అడవిశ్రీరాంపూర్ గ్రామానికి చెందిన గాదర్ల హరీశ్ (28) గత నెల 11న దసరా పండుగ సందర్భంగా మైదంబండలోని తన బంధువుల ఇంటికి ద్విచక్రవాహనంపై వెళ్లాడు. తిరిగి వచ్చే క్రమంలో బైక్ అదుపుతప్పి మెయిన్ పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. అప్పటి నుంచి హరీశ్‌కు కుటుంబ సభ్యులు కరీంనగర్‌లో చికిత్స అందిస్తున్నారు. నాలుగు రోజుల క్రితం పరిస్థితి విషమించడంతో వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానకు తరలించగా, ఆదివారం రాత్రి చికిత్స పొందుతూ మృతిచెందాడు.

## హమాలీ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

పెద్దపల్లి టౌన్, నవంబర్ 3: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం హమాలీ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు పిలుపునిచ్చారు. ఆదివారం వ్యవసాయ మార్కెట్ ఆవరణలో సీఐటీయూ అనుబంధ కార్మిక సంఘం హమాలీ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ముత్యంరావు మాట్లాడుతూ, ప్రభుత్వం ఏర్పడి 11 గడుస్తున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయలేదని మండిపడ్డారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే పోరాటాలకు సిద్ధమని స్ప ష్టం చేశారు. ఇక్కడ జిల్లా హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు తిరుపతి, సదయ్య, కనకయ్య, శంకరయ్య, వెంకటేశ్, పోచయ్య ఉన్నారు.

## సంస్మరణ సభ

జ్యోతినగర్ (రామగుండం), నవంబర్ 3: రామగుండం హౌసింగ్‌బోర్డు కాలనీలోని కత్తెరమల్ల పోచన్న స్మారక స్తూపం వద్ద సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా ఆధ్వర్యంలో పోచన్న సంస్మరణ సభ జరిగింది. స్మారక స్తూపానికి నాయకులు పూలమాల వేసి నివాళుర్పించారు. అమరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు చేపడుతామని నినదించారు. ఇక్కడ సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా పెద్దపల్లి డివిజన్ కార్యదర్శి తోకల రమేశ్, అంతర్గాం మండల కార్యదర్శి గుమ్మడి వెంకన్న, జిల్లా నాయకులు గూడూరి వైకుంఠం, మార్త రాములు, గొల్లపల్లి చంద్రయ్య, తీగుట్ల రాములు, పెండ్యాల ఓదెలు, కలువల రాయమల్లు, గుండ్ల పోశం, తదితరులు ఉన్నారు.

## మున్నూరు కాపులు

# రాజకీయంగా చైతన్యం కావాలి

- సమాజానికి దిక్సూచిగా నిలువాలి
- ఐక్యతతో ముందుకు సాగాలి
- రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర



బంధంపల్లి స్వరూప గార్డెన్‌లో జరిగిన మున్నూరు కాపు ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర

పెద్దపల్లి టౌన్, నవంబర్ 3 : రాష్ట్రంలోని మున్నూరు కాపులు ఆర్థికంగా, రాజకీయంగా చైతన్యం కావాలని, సమాజానికి దిక్సూచిగా నిలువాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు. ఆదివారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బంధంపల్లి స్వరూప గార్డెన్‌లో నిర్వహించిన మున్నూరు కాపుల ఆత్మీయ సమ్మేళనానికి హాజరై మాట్లాడారు. రాజకీయంగా ఎదగాలంటే ముందుగా ఆర్థికంగా నిలదొక్కుకోవాలని సూచించారు. కాపుల్లో ఎన్ని విభేదాలున్నా రాజకీయ పార్టీలను పక్కనపెట్టి ఐక్యతతో ముందుకు వచ్చి కలిసి పనిచేయాలని కోరారు. బీసీలకు రాజకీయంలో సమన్యాయం జరగాలంటే కాపులు అన్ని కులాలను కలుపుకొని వెళ్లాలని సూచించారు. ప్రభుత్వం చేపట్టే సమగ్ర ఇంటింటి సర్వేలో కులాల లెక్క తెల్చేందుకు కుల గణన నిర్వహిస్తున్నదని, 80 వేల మంది ఎన్యుమరేటర్లు ద్వారా సర్వే చేస్తోందని, దీని వల్ల బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు పొందే అవకాశాలున్నాయని వివరించారు. అనంతరం సమ్మేళనానికి హాజరైన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, పెద్దపల్లి మాజీ జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ ప్రసంగించారు. అనంతరం అతిథులను కాపు సంఘం నేతలు సత్కరించారు. ఇక్కడ కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనమాల ప్రవీణ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు అనుమాల మహేశ్, రాష్ట్ర కన్వీనర్ చింతపండు మహేందర్, నాయకులు బండి సంజీవ్, తొగరి సురేశ్, ఎడ్ల రవి, డాక్టర్ రాజుకుమార్, అనిల్, కిషన్, రాజేశం, కాంతయ్య పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు గడువు పొడిగించాలి

- ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఓంప్రసాద్

కలెక్టరేట్, నవంబర్ 3 : కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ పట్టభద్రుల శాసనమండలి ఓటరు నమోదు గడువు పొడిగించాలని తెలంగాణ గ్రాడ్యుయేట్స్, అన్‌ఎంప్లాయీస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఓంప్రసాద్ డిమాండ్ కోరారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి ఈమెయిల్ ద్వారా వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. ఓటరు నమోదు గడువు ఈనెల 6తో ముగియనున్నదని, ఇప్పటివరకు నియోజకవర్గ పరిధిలో ఓటర్ల నమోదు సంఖ్య కనీసం 2 లక్షలు కూడా దాటలేదని పేర్కొన్నారు. ఓటరు నమోదు కోసం ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన నాటి నుంచి నేటి వరకు వచ్చిన దరఖాస్తుల పరిశీలనలో తీవ్ర జాప్యం నెలకొందని, దీంతో వేలాది మందికి ఇప్పటివరకు క్లియరెన్స్ మెస్సేజ్‌లు రాలేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఆధార్‌కార్డుల్లో చిరునామా ఓచోట, ఉద్యోగాలు, వృత్తి, వ్యాపారాలతో ఇతర ప్రాంతాల్లో నివసిస్తుండగా వారు దరఖాస్తు చేసుకున్నా, ఆమోదించడం లేదని తెలిపారు. డిసెంబర్ 31 వరకు దరఖాస్తుల ప్రక్రియ కొనసాగించాలని, ఓటరు నమోదు కోసం అవగాహన కార్యక్రమాలు కూడా విస్తృతం చేయాలని ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# పగుళ్లుపడిన బడితో ప్రమాదమే..

- బిక్కుబిక్కుమంటున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు
- కొత్త భవనం నిర్మించాలని విజ్ఞప్తి

వడ్కాపూర్‌లోని పాఠశాల భవనం



జూలపల్లి, నవంబర్ 3: వడ్కాపూర్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనం ప్రమాదకరంగా మారింది. పెచ్చులూడుతున్న గదుల పైకప్పు, ఎక్కడికక్కడా ఊడిపోతున్న కిటికీలు, దర్వాజలు, పగుళ్ల పడిన గోడల మధ్య ఉపాధ్యాయులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. దాదాపు 70ఏండ్ల క్రితం ఇక్కడ పాఠశాల భవనం నిర్మించారు. ఏండ్ల తరబడి కనీసం మరమ్మతులు లేక కాలక్రమేనా పూర్తిగా శిథిలమై భవనం ఎప్పుడు కూలుతుందోనని ఆందోళన చెందుతున్నారు. పాఠశాలలో 6 నుంచి పదో తరగతి దాకా 125మంది విద్యార్థులున్నారు. ఈ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది కలిపి మొత్తం 15 మంది విధులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు సరిపడా తరగతి గదులున్నా హెచ్ఎం, ఉపాధ్యాయులకు వేర్వేరుగా గదులు లేక నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో ఏ క్షణానో కూలడానికి సిద్ధంగా ఉన్నప్పటికి పాత కాలం నాటి భవనాన్ని తప్పనిసరి పరిస్థితుల్లో వాడుకుంటున్నారు. వానకాలంలో గోడలు తడిసి, పైకప్పు ఉరవడంతో రికార్డులు, రిజిష్టర్లు తడిసి ముద్దవుతున్నాయి. గదుల్లో నిలబడలేక, కూర్చోలేక నిత్యం ఉపాధ్యాయులు అష్టకష్టాలు పడుతున్నారు. పాములు, తేళ్లు గదుల్లో సంచరించడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులు తీయాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందించి పాత భవనం కూల్చేసి కొత్త భవనం నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



హెచ్ఎం గదిలో ఊడిన కిటికీ

## గుడి కమిటీకి రికవరీ

గోదావరిఖని, నవంబర్3: సింగరేణిలో కార్మికులు ఇచ్చిన ఆథరైజేషన్ ప్రకారం పేషీట్ రికవరీ చేయడానికి టెక్నికల్ సమస్యతో ఏఐటీయూసీ యూనియన్‌కు ఇచ్చే చందాల రుసుం గుడి కమిటీ (1835) కోడ్ మీద రికవరీ చేశామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ పేర్కొన్నది. ఈ చందా రికవరీపై కొన్ని కార్మిక సంఘాలు ఏఐటీయూసీపై చేస్తున్న తప్పుడు ఆరోపణలను కార్మికవర్గం ఖండించాలని ఏఐటీయూసీ పేర్కొంది.

## పనులు ప్రారంభం

కమాన్‌పూర్, నవంబర్ 3: గుండారం గ్రామ పంచాయతీ పరిధిలో ఆదివారం 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3.50 లక్షలతో మూడు బోర్‌వెల్స్ నిర్మాణం పనులను ప్రారంభించారు. గ్రామంలోని రైతువేదిక వద్ద బోర్‌వెల్‌తోపాటు విద్యుత్‌మోటర్ ఏర్పాటు కోసం రూ.1.50లక్షలు, రాజాపూర్ పోచమ్మ ఆలయం వద్ద హ్యాండిల్ బోర్‌వెల్‌కు రూ.లక్ష, గుండారం రిజర్వాయర్ షెటర్ల వద్ద హ్యాండిల్ బోర్‌వెల్‌కు రూ.లక్ష చొప్పున గతంలో నిధులు మంజూరయ్యాయి. ఇక్కడ మాజీ ఎంపీపీ రాచకొండ లక్ష్మీ రవి, మాజీ సర్పంచ్ ఆకుల ఓదెలు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు సాగి శ్రీధర్‌రావు, ఆకుల రాజయ్య, ఆవునూరి కిరణ్, ఆవునూరి రాజలింగు, పిడుగు పోచాలు, శ్రావణ్, స్వామి ఉన్నారు.

## పట్టణ కార్యదర్శిగా మహేశ్వరి

కోల్‌సిటీ, నవంబర్ 3: సీపీఐ(ఎం) గోదావరిఖని పట్టణ కమిటీ కార్యదర్శిగా అనుముల మహేశ్వరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా కార్యదర్శి వై యాకయ్య ఆదివారం ప్రకటించారు. కమిటీ సభ్యులుగా కుమారస్వామి, మెండె శ్రీనివాస్ మేదరి సారయ్య, వడ్లకొండ నాగమణి, ఉపేందర్, కొమురయ్య, నలుగురు కో ఆప్షన్ సభ్యులను ఏకగ్రీవంగా నియమిస్తూ తీర్మానం చేసినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను ప్రభుత్వం అమలు చేసేవరకు నిరంతరం పోరాటం చేస్తామన్నారు.

### మండల కార్యదర్శిగా అశోక్

పెద్దపల్లి రూరల్, నవంబర్ 3: సీపీఎం పెద్దపల్లి మండల కార్యదర్శిగా రాఘవపూర్‌కు చెందిన కల్లెపల్లి అశోక్ ఎన్నికయ్యారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో అశోక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోగా, కమిటీ సభ్యులుగా సీపెల్లి రవీందర్, జిల్లాల ప్రశాంత్, మోదుంపల్లి శ్రావణ్, ఎస్ వెంకటస్వామి, ఎండీ ఖాజాను ఎన్నుకున్నారు.


